


## గురు భక్తి

అవధాని మేష్టారితో కలసి మొత్తం పదిహేనుమంది బయలుదేరాం ప్రక్క నున్న పల్లెటూరికి వయోజన విద్యా వ్యాప్తికోసం. మొదటి రెండు రోజులు గ్రామంలో తిరిగి వయోజనులందరిని రాత్రిపూట మా క్యాంపుకు రమ్మని ప్రచారంచేసాం. మేం పాటించవలసిన విధులన్ని చెపుతూ ఆఖరున "మీరు ఆంజనేయునివలె చూచి రమ్మంటే కాల్చిరావాలి" అన్నారు నవ్వుతూ అవధాని మేష్టారు ఛలోక్తిగా. ప్రతిరోజు క్యాంపులో చాల హుషారుగా నే వుంటోంది. వయోజనులు చాలమంది ఉత్సాహంతో వస్తున్నారు. ఇలా సాగుతుండగా ఒకరోజు మధ్యాహ్నం రావుని శర్మని "సిజర్సు పేకెట్" తెమ్మని పంపారు మేష్టారు. వాళ్ళు బజారుకెళ్లి ప్యాకెట్ తీసికొనివచ్చారు. మేష్టారు పేకెట్ విప్పిచూసేటప్పటికి అందులో రెండు సిగరెట్లు తక్కువగా వున్నాయి. ఇదేమిటోయ్ అన్నారు అవధానిగారు రావు, శర్మలను చూచి. వాళ్లిద్దరూ నవ్వుతూ "మీరు చెప్పినట్లే చూసి రమ్మంటే కాల్చివచ్చేమ"న్నారు. మేష్టారు పక్కున నవ్వి "బలే! పరమానందయ్య శిష్యుల్లా వున్నారే!" అన్నారు. అప్పుడు నేను "అయితే పరమానందయ్య మీరే!" నన్నాను. మా క్యాంపర్సంతా ఒకటే నవ్వు. మేష్టారు కూడ మాతోపాటే శృతికలిపేశారు. ఒక పావుగంటసేపు మా క్యాంపు 'నవ్వులమందిరం' అయిపోయిందంటె నమ్మండి!

సి. హెచ్. శ్రీరామమూర్తి

## రిఫ్రెష్‌మెంట్ రూమ్

ఒకసారి మా సుందరం అన్నయ్యా, వాడి స్నేహితుడు యిద్దరూ కలసి ప్రయాణం కడ్తుంటే "ఎక్కడికన్నయ్యా ప్రయాణం?" అని అడిగా. "ఆ ఏమీలేదు నా స్నేహితుడు రామారావు ఎప్పుడూ కాకినాడ పట్టణము చూడలేదట, చూపించివద్దామని బయల్దేరా" అన్నాడు. ప్రయాణంకోసం మా సుందరం అన్నయ్య ఏదో కాస్త కాలేజీలో చదువుచున్నాడు కాబట్టి ప్యాంట్ చొక్కా, చలవద్దాలు వగైరాపెట్టి టిప్‌టాప్‌గా తయారైతే, వాడి స్నేహితుడు రామారావు, నేను ఏదో చిన్నసైకిల్ షాపు ఓనర్ (యజమానిని)గదా నాకెందుకీ పోకులు అని పూనుకోక, వాడు కూడా సుందరంలాగే తయారై, వాడితో బాటు కాకినాడ ప్రయాణానికి బయల్దేరాడు. మొత్తానికి ఇద్దరూ బయల్దేరి అత్తిలిలో ఎక్కి నిడదవోలుస్టేషనులో దిగారు. మళ్ళీ కాకినాడ వెళ్ళేబండి వచ్చేవరకు కాలక్షేపంకోసం సుందరం అన్నయ్య ఒక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కొన్నాడట. ఇంతలో స్టేషనులో హఠాత్తుగా సుందరం అన్నయ్యకు వాడి పాతస్నేహితు డొకడు కలిస్తే, వాడి చేతిలోవున్న సంచీ, పేపరు రామారావుకిచ్చి "నీవు యివి రెండూ పట్టుకొని వుండు. మేం యిప్పుడే బజార్లోకెళ్ళి వస్తాం" అని యిద్దరు బజారులోకెళ్ళారట. రామారావు కేమీ ఉబుసుపోక చేతిలోవున్న పేపరు తిప్పి బొమ్మలు చూస్తూ కూర్చున్నాడట. ఇంతలో ఎవరో జంటిల్‌మెన్ ఒకడు వచ్చి రామారావుతో "ఏమండీ! యిచ్చట రిఫ్రెష్‌మెంటురూమ్ ఎక్కడ ఉన్నదండీ" అన్నాడట. మనవాడికి ఏమీ అర్ధంగాక, ఊరికే వుండటమెందుకను కొని అటు చేయిజాచి "మరుగుదొడ్డి" వైపుజూపి "అదుగోనండి అక్కడవున్నదండీ" అన్నాడట. ఆ ఆగంతకుడు అంతదూరము వెళ్ళి, మళ్ళీ తిరిగివచ్చి "ఏమండీ అక్కడ ఏమియు లేదండీ" అన్నాడట. అప్పుడు మన రామారావు ఆ ఆగంతకుడిని ఆ మరుగుదొడ్డిదగ్గరకు తీసుకెళ్ళి "ఇదుగోండి ఇందులో పురుషులు, ఇందులో స్త్రీలు వెళ్తారు. ఇదిగో మీరు అడిగింది" అని అన్నాడట. ఆ ఆగంతకుడు నిర్ఘాంతపోయి తెల్లమొహంవేశాడట. మన రామారావు కూడా అతన్నిచూచి వీడూ తెల్లమొహం వేశాడట. ఇంతలో మా సుందరం అన్నయ్య అచ్చటకువచ్చి సంగతంతా కనుక్కొని ఆ ఆగంతకునితో "క్షమించండి, మావాడికి ఇంగ్లీషు తెలియదు" అని చెప్పి సర్దాడట. ఇల్లావుంటుంది చదువురానివాళ్ళు షోగ్గా అభినయిస్తే.

పట్నాల జయ

* * *

## బేడ్ లక్

నేను చిన్నప్పట్నుంచీ ఓ చిన్న సైంటిస్టునౌదామనుకొనేవాణ్ణి. అంచేత యింట్లోనే ఓ చిన్నలేబరెటరీ ఓపెన్ చేసాను. కనుక నాకు అవుసరంలేని

వస్తువంటూ లేనేలేదు. మా యింట్లో నౌకరు కుర్రాడు రాము చాలా చురుకైనవాడు. కాని పరమానందస్వాముల వారి ప్రియశిష్యుడు. నోటంట మాట రావడమే తడవు చేసేశేవాడు.

ఓరోజు మా అమ్మ వాడికి బజారు నుండి తేవలసినసరుకులు చెబుతోంది. వాడు శ్రద్ధగా వింటున్నాడు. ఇంతలో ప్రక్కనే టేబులువద్దనున్న నేను నా ఎక్స్పరిమెంటు ఫెయిలువల్ల బేడ్‌లక్ అన్నాను.

మా రాముగాడు బజారునుంచి తిరిగివచ్చి అమ్మకు సరుకులు అప్పచెప్పి, నా లేబరేటరీరూములో కొచ్చి "బాబుగారూ యిందండి లక్క" అన్నాడు. నేనాశ్చర్యపోయి "యేమి లక్కరా?" అన్నాను. "ఆదే" బాబు యిందాక అమ్మగారు సరుకులు చెప్పుతున్నప్పుడు మీరు టేబులు కాడినుండి బేడలక్కన్నారు గదటండీ" అన్నాడు. ఇంతలో నా కా యిన్సిడెంటు జ్ఞాపకం వచ్చి, బేడ్‌లక్‌కొచ్చిన తిప్పలా యివని నవ్వుకున్నాను. ఇంతలో మానాన్న ఏంటిరా ఆ నవ్వు అన్నారు. మానాన్నగారికా బేడ్‌లక్ ఇన్సిడెంటంతా చెబితే, తనూ నవ్వటం మొదలెట్టారు. మా యిద్దరి నవ్వులూచూసి మా రాముగాడు తెల్లమొహంవేశాడు.

రాజ్‌కుమార్

* * *

## శివాజీ పాలన

అది నా మూడవ ఫారం చదువుకొనే రోజులు. మాక్లాస్‌కల్లా కొంటె పిల్లోడు ధర్మన్న. డొక్కచీల్చినా అక్షరము రాదు. ఎల్లవేళలా సినిమా పాటలు పాడడం, ఉపాధ్యాయుల వెక్కిరించడం నాలుగు చీవాట్లుతినడం పరిపాటి.

ఆరోజు క్రొత్తగా వచ్చిన హిస్టరీ (చరిత్ర) మేష్టర్ శివాజీనిగూర్చి లెక్చరదంచేస్తున్నాడు. అరాత్రి మన ధర్మన్న సెకెండ్‌షోకు హాజరు కావటంచే చిన్న కునుకుపట్టింది. మేష్టరేలా గ్రహించాడో మూలనున్న ధర్మన్నను.

అబ్బాయ్! శివాజీనిగూర్చి నాలుగు ముక్కలు చెప్పంటూ ప్రశ్నించాడు. అప్రశ్న పూర్తికాకముందే హస్తముగట్టి వినయవిధేయతతో శివాజీ! నీ పరిమళ పక్కపాడి చాల బాగున్నది. ఇంక కాస్త శ్రద్ధపూనావంటే ఫస్టు క్లాస్‌గా అమ్ముడుపోతాయి. కాస్త జాగ్రత వహించు బాబూ ... అంటూ ముగించాడు. పిల్లలందరు గొల్లున నవ్వారు. మేష్టరుకు నవ్వాలో యేడ్వాలో తెలియక నెంబర్ సెవన్‌లా ఫేస్ మార్చి కుర్చీలో కూలబడ్డారు.

టి. మాణిక్యం

* * *

## సిగ్గు

నేను మా అత్తవారింటికి వెళ్లడము అదే ప్రథమం. నా శ్రీమతి కన్నవారింటనే యున్నది. నాకు ఏమిటో గాని చిన్నప్పటినుండి క్రొత్తవారిని చూచిన, ఆడవాళ్లను చూచిన ఎచ్చటలేని సిగ్గు వచ్చిపడుతుండేది. ఆడవాళ్లకైన అంత సిగ్గు యుండదేమో!

మా అత్తగారు చెంబుతో నీరు యిచ్చి, కాళ్ళుకడుక్కొని భోజనమునకు రమ్మన్నారు. కాళ్ళుకడుగుకొని పీటమీద కూర్చున్నాను. మా అత్తగారు పంచ భక్ష్య పరమాన్నములతో విస్తరియందు వడ్డించారు. నేను తలదించుకొనే భోజనముచేయుచున్నాను. నాకు సిగ్గు ఎక్కువని ముందే చెప్పుకున్నాగా! నా శ్రీమతి తలుపుచాటున నిలుచొని చూస్తున్నది గాబోలు నాకు ఏమిటవసరమో అని! పాయసము చాల బాగుంది గనుక అపారముగా ముగించాను. ముగించానోలేదో తిరిగివడ్డించుచుంటె "అహా! వద్దండి అత్తగారు" అన్నాను. పకాలున నవ్వు వినిపించింది. మొఖమెత్తి చూస్తిగదా వడ్డించేది నా శ్రీమతి. "తస్సాదియ్యా నువ్వా" అని రూపాయంత మొఖము చేసుకున్నాను. అప్పటినుండి సిగ్గు వదలుకున్నాను.

డి. పి. కె. పట్నాయక్

* * *

## యుక్తిపరుడు

ఆదినముసోమవారము. నేను ఆచంటకు బస్సులో ప్రయాణము చేయుచున్నాను. ఆ బస్సుడ్రైవరు క్రొత్తగా డ్రైవింగ్ నేర్చుకొన్నాడు. ఇంకా లైసెన్సు యీయలేదు. డ్రైవింగ్ వచ్చుటవల్ల స్పీడుగా వదిలాడు. అకస్మాత్తుగా యొక కోడిపుంజు యొకటి వచ్చి బస్సుక్రిందపడ్డది. ఆకోడిపుంజు దగ్గిరగాయున్న ఒక సామాన్య రైతుది. నే వెళ్ళుచున్న బస్సుడ్రైవరు చనిపోయిన కోడిపుంజునుచూచి అలాగే నిలబడ్డాడు. అతని వాలకము చూచి ప్రయాణికులు ఏడవాలా, నవ్వాలా యన్న సందిగ్ధావస్థయందున్నారు. డ్రైవరునకు చెమట పట్టింది. కారణము లైసెన్సు లేకుండా బస్సు నడుపుచుండుటవల్ల, వెంటనే ఆ సామాన్య రైతుకూడా దగ్గిరకు వచ్చాడు. వాడిని చూచినవెంటనే డ్రైవరు పది రూపాయిలనోటును తీసి గోల చేయకుండా తీసుకొని పో అన్నాడు. ప్రయాణీకులంతా ఆశ్చర్యముగా చూస్తున్నారు. రెండు రూపాయిలపుంజుకు పది రూపాయిలు యీయుగానే రైతు సంతోషించి యిలాగన్నాడు. బాబూ ప్రతిదినము మీరు యీత్రోవనే బస్సునడుపుతుండండి. నేను కోళ్లవ్యాపారము పెడతానన్నాడు. ఆమాటలకు డ్రైవరు డంగైపోయాడు.

బి. జి. వి. నరసింహారావు